**జరిగిన కథ :** ఒకనాడు మిత్రబృందంతో వచ్చి జాయపుణ్ని కలిశాడు పుళిందపుడు. దండరాసకం ఆటలో పాల్గొనాలని కోరాడు. ఆసక్తిగా తన వెంట ఉద్యానవనానికి వెళ్లాడు జాయపుడు. అక్కడంతా తెలిసిన మిత్రులే ఉన్నారు. వారిలో ఇంద్రాణి కూడా ఉన్నది. ఇద్దరూ కన్నులతో పలకరించుకున్నారు. ఆడటానికి ఉద్యుక్తులయ్యారు. మిత్రులంతా క్రీడాకారులయ్యారు. అయితే, అక్కడన్నీ వృక్షాలు అల్లుకుని ఉన్నాయి. ఆ చెట్ల కొమ్మలకు వేలాడుతున్న గోగునార పాయలను అందరూ ఆశ్చర్యంగా చూశారు.



65
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

కార్యక్రమ నిర్వాహకుడు పుళిందపుడు గొంతెత్తి ప్రకటించాడు.

‘‘దండరాసకం ఆడుతూ వేలాడుతున్న గోగునారతో జడ అల్లాలి. ఎవరు ముందుగా పూర్తి చేస్తారో.. వారు ప్రథములవుతారు’’..

‘ఓహ్! ఇదేదో కొత్త సృజన.. బావుంది బావుంది!’ అనుకున్నాడు జాయపుడు.

ఇంద్రాణి వైపు చూశాడు. అప్పటికే ఆమె అతనివంక చూస్తున్నది. తనక్కూడా ఆసక్తి ఉన్నట్లు ఆమె కనుదోయి ప్రకటించింది. దగ్గరగా వచ్చినప్పటి బిడియపు స్పందన.. దూరాన ఉన్నప్పుడు లేదు. దూరంనుంచి రాగప్రసారం సమున్నతం.

‘‘అల్లిక అంటే అమ్మాయిలే నెగ్గుతారుగా పుళిందపా..’’ అన్నారెవరో గట్టిగా, హాస్యయుతంగా.

అవునవునంటూ అమ్మాయిలంతా తమ కేశసంపదను ప్రదర్శిస్తున్నట్లుగా.. వెనకనున్న తమ జడలను సుతారంగా ముందుకు తెచ్చారు.

అందరికంటే పొడవైన జడ ఇంద్రాణిదే! సంభ్రమంగా చూశాడు జాయపుడు. ఆమెకు అంత కేశసంపద ఉన్నట్లు అప్పటివరకూ గుర్తించకపోవడం ఘోరమైన తప్పుగా, తీవ్రంగా కుమిలిపోయాడు. ఆమెను అభినందనగా చూశాడు. ఆమె ప్రకటించిన స్మితం మహత్తరం.

‘‘నాది పిలకజడ.. కాబట్టి ఇంద్రాణి కంటే నేనే వేగంగా జడ అల్లగలను!’’.. అందరినీ నవ్వించింది లవంగిక.

అంతా ఉత్సాహంగా దండియలు కదుపుతూ పక్కన తగిన స్నేహితుణ్ని లేదా స్నేహితురాలిని కోరి ఉంచుకుంటున్నారు. తన పక్కకు రమ్మన్నట్లు ఇంద్రాణిని అభ్యర్థించాడు జాయపుడు. ఆమె బిడియంగా చూసి.. ఇష్టమేనన్నట్లు చిరునవ్వు నవ్వి, కదిలి వస్తూవస్తూ మరోచోట ఆగిపోయింది.

‘ఈ కోమలాంగికి కచ్చితమైన నిర్ణయం తక్కువనుకుంటా..’ నిట్టూర్చాడు జాయపుడు.

క్రీడ మొదలయ్యింది. సంగీతం ప్రారంభమయ్యింది. డోలు, సన్నాయి జమిలిగా మారుమోగుతున్నాయి. మెల్లగా మొదలై లయబద్ధంగా పడుతున్న అడుగుల వెంట.. అంతే లయబద్ధంగా మోగుతున్న దండియలు. అదే సమయంలో పట్టుకున్న నారను పాయలుతీస్తూ, వడివడిగా జడ అల్లడానికి క్రీడాకారులు పడుతున్న ఆతృత! రానురానూ అన్నీ సంగమిస్తూ.. ఆటలో ఉరవడి పెరుగుతున్నది. ముచ్చట్లు, వ్యాఖ్యలు.. అమ్మాయిలపై అబ్బాయిలు.. అబ్బాయిలపై అమ్మాయిలు.. జోరు పెరుగుతున్నది. దండియల ధ్వని కూడా రెచ్చిపోతున్నది.

దండియలు.. నాట్యాలు.. అల్లికలు..

నాట్యాలు.. దండియలు.. అల్లికలు..

అల్లికలు.. నాట్యాలు.. దండియలు..

అన్నీ కలగలిసిపోతూ.. ఉద్యానమంతా ఉర్రూతలూగుతున్నది. చాలామంది జడ అల్లడమూ పూర్తవుతున్నది.

తను అల్లుతూ అందరినీ చూస్తూ.. ముఖ్యంగా ఇంద్రాణిని చూస్తూ, చూపులతో ప్రోత్సహిస్తూ.. జాయపుడు. తాను గెలవకూడదని ముందే నిశ్చయించుకున్నాడు. గెలవడం కంటే అందరి క్రీడాతత్వాన్ని చూస్తూ వీలైతే ఇంద్రాణిని గెలిపిస్తే ఎలా ఉంటుంది!??

అప్పుడప్పుడూ మధ్యమధ్య పెద్దపెట్టున అరుస్తున్నారు ముమ్మడి, సుగ్రీవ, సీమంతిని.

ఆమెకు, లవంగికకు మధ్య పోటీ.. ‘నువ్వా నేనా!?’ అన్నట్లుంది. ఇంద్రాణి చెమటలు కక్కుతూ అల్లుతున్నది గానీ, కాస్త వెనకపడినట్లే..

ఉన్నట్టుండి అరిచాడు జాయపుడు..

‘‘జడ అల్లడం మాత్రమే కాదు. ఆ జడను తిరిగి ఊడదీయాలి. అప్పుడే గెలిచినట్లు!’’.

అందరూ గందరగోళంగా మాట్లాడారు.

కానీ, చివరికి పుళిందపుడు..

‘‘జాయపుడు లేవనెత్తిన క్రీడాంశం సబబే! ఇది దండరాసకానికి మరొక కొత్త జోడింపు..’’ అని ప్రకటించాడు.

క్రీడాప్రాంగణం మరోసారి ఉవ్వెత్తున ఉత్సాహంతో తేజరిల్లింది. చివరికి ఎంత పాకులాడినా.. ఇంద్రాణి గెలవలేకపోయింది. జాయపుడు తన సానుభూతిని ప్రకటించాడు. క్రీడ అద్భుతంగా విజయవంతమైంది. ఇలాంటి కార్యక్రమాలు, క్రీడలు మరిన్ని జరపాలని తీర్మానిస్తూ పుళిందపుణ్ని అందరూ అభినందించారు.

అందరూ ఒక్కసారిగా వెళ్లడానికి ఉద్యుక్తులవగా.. వెళ్తూవెళ్తూ ఇంద్రాణి దగ్గరగా వెళ్లి..

‘‘అనుమకొండలో గుండయామాత్యుని గురుకులానికి వస్తే సంతోషం..’’ అన్నాడు జాయపుడు.

ఆమె తల ఎత్తి చూసి, అంగీకారంగా తల ఊపింది.

‘‘సత్వరమే! అంటే రేపే!’’.